# సమర సేనానికి అరుణాంజలి



www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
పోటు ప్రసాద్ సంస్మరణ ప్రత్యేక సంచిక
ఆదివారం | 08 | డిసెంబర్ | 2024
పేజీలు 8

## ధైర్యశాలి, దీక్షాదక్షుడు
## త్యాగాన్ని సంపదగా భావించిన పోటు



పోటు ప్రసాద్ జీవితంలో పలు మలుపులు చూశారు. విద్యార్థి దశ నుంచి సిపిఐ జిల్లా కార్యదర్శి వరకు ఎదిగిన పోటు ప్రసాద్ ధైర్యశాలి, దీక్షాదక్షుడు. నేను కొత్త గూడెం మండలాధ్యక్షునిగా పనిచేసేటప్పుడు ప్రసాద్‌తో పరి చయం ఏర్పడింది. విద్యార్థి సంఘం నాయకునిగా ఆయన వ్యవహరించే తీరు, ఉద్యమ అవగాహన నన్ను ఎంతగానో ఆకట్టుకునేది. కళాశాల ఎన్నికల సందర్భంగా ఘర్షణ జరి గిన నేపథ్యంలో నాపై టాడా కేసు నమోదైనప్పుడు ప్రసాద్ చేపట్టిన ఆందోళన, సాగించిన పోరాటం నాకు ఇంకా గుర్తే. ఎంత ధైర్యశాలి అంటే పోలీసులు లాఠీలతో కొడుతున్న వెనక్కి రావడం ప్రసాద్‌కు తెలియదు. కరెంటు ఉద్యమంలో ఓ వైపు పోలీసుల కాల్పులు, మరో వైపు గుర్రాలతో తొక్కిస్తున్న ప్రసాద్ మాత్రం రాళ్లు విసురుతూ ముందుకు పోవడం ఇప్ప టికీ నా కండ్ల ముందు మెదులుతూనే ఉంది. 60 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత కూడా బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఇందిరా పార్కు స్వాధీనోద్యమంలో ప్రసాద్ అందరి కంటే పోలీస్ నిర్బంధాలను ఎదుర్కొని ఇందిరా పార్కులోకి వెళ్లి ఎర్ర జెండా పైకెత్తి నినాదించిన తీరు ఆయన పోరాట తత్వా నికి ప్రతీక. పోటు ప్రసాద్ కుటుంబం త్యాగాన్ని సంపదగా మార్చుకుంది. మూడు తరాలు ఆ త్యాగాల ఒడిలోనే ఎర్ర జెండాను సాకాయి. ఎర్రమ్మ ధీరత్వం, రాఘవయ్య త్యాగ గుణం కలగలిసిన ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీలో ఓ ఆణిముత్యం. ఏ కార్యక్రమం తీసుకున్నా దానిని విజయవంతం చేసేంత వరకు విశ్రమించే వాడు కాదు. విద్యార్థి నాయకునిగా, కార్మిక సంఘం నేతగా అనేక దశాబ్దాల పాటు పనిచేసిన ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా తనదైన పద్దతిలో ఉద్యమాన్ని నడిపించారు. ఆందోళనలంటే కొద్ది మంది పాల్గొనడం కాదు పార్టీ యావత్‌ను ఉద్యమంలో పాలు పంచుకునేలా చేయాలనే తపన ప్రసాద్‌లో ఉండేది. అందుకే పార్టీ క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేస్తూ ప్రతి కార్యక్రమానికి ముందు భాగాన ఉండే వారు. రాష్ట్ర సమితిలో జరిగిన ప్రతి నిర్ణయాన్ని తూచ తప్పకుండా అమలు చేసేవారు. తనకు నచ్చని విషయాలను మోహమాటం లేకుండా చెప్పే ప్రసాద్ పార్టీ నిర్ణయాన్ని మాత్రం తూచ తప్పక పాటించే వారు. పార్టీ పునరుద్దరణ కార్యక్రమంలో ప్రసాద్ తీసుకున్న నిర్ణయం యావత్ రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిందనడంలో నాకు ఎటువంటి సందేహం లేదు. ఒక పక్క కార్యోన్ముకునిగా మరో పక్క మంచి స్నేహితుడిగా కొన్ని సందర్భాల్లో గైడ్‌గా కూడా ప్రసాద్ వ్యవహరించే వారు. పార్టీకి సంబంధించిన విషయాల వరకు పోటు ప్రసాద్ అనుసరించే విధానం ఎప్పటికైనా ఆదర్శనీయమే. నిజాయితీకి నిలువుటద్దంగా కీర్తి గడించిన ప్రసాద్ సిపిఐ జాతీయ మహాసభలను ఖమ్మంలో జరపాలన్న ఆలోచన వచ్చినప్పుడు ఎంతో ఉత్సుకత ప్రదర్శించారు. ఓ సారి జరపాలి అన్న ధృడ నిశ్చయంతో పార్టీ సహచరులతో సంప్రదించాడు. ప్రసాద్‌లో ఉన్న పట్టుదల నేటి తరానికి ఆదర్శం కావాలి. ఆయన అనుసరించిన విధానం మార్గదర్శకం కావాలి. ఖమ్మంజిల్లా ఉద్యమంపై చెరగని ముద్ర వేసిన ప్రసాద్‌కు విప్లవ జోహార్లు అర్పిస్తూ ....

-కూనంనేని సాంబశివరావు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి



## మార్గదర్శి.. ఆత్మీయుడు.. చిరస్మరణీయుడు



పోటు ప్రసాద్ నా జీవిత ప్రతి మలుపులోనూ భాగ స్వామి. నా జీవితానికి మార్గదర్శి కూడా. నా జీవితంలో ప్రతి మలుపు లోనూ పోటు ప్రసాద్ అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించారు. అందుకే నేను ఆయనను మార్గదర్శి అంటాను. విద్యార్థి దశలో నన్ను ప్రజా ఉద్యమానికి పరిచయం చేసిన వ్యక్తి. 1986లో నేను ఇంటర్ చదువుతున్నప్పుడు మా తాత గారైన మేదరమెట్ల రామయ్య గారిని పార్టీ ఆఫీస్ నుంచి మా రూముకు తీసుకెళ్లేందుకు తరచూ వచ్చే వాడిని. అదే సందర్భంలో మా గ్రామంలో నెలకొన్న పరిణామాల నేప థ్యంలో మా కుటుంబం సిపిఎం నుంచి సిపిఐలో చేరింది. సాధారణ పరిస్థితుల్లో ప్రారంభమైన మా పరిచయం ప్రసాద్ మరణానికి కొన్ని నిమిషాల ముందు వరకు వీడదీయరాని రీతిలో కొనసాగింది. సాధారణ సభ్యునిగా చేరిన తనకు

మిగతా 2లో..



# సమర సేనానికి అరుణాంజలి



## కడపటి వీడ్కోలుకు కదిలొచ్చిన జనం
## అశ్రునయనాల మధ్య పోటు ప్రసాద్ అంతిమ యాత్ర



**ప్రజాపక్షం/ఖమ్మం :** కడ వరకు కమ్యూనిస్టుగా నిలిచి ఎందరికో స్ఫూర్తినిచ్చి కమ్యూనిస్టు ఉద్యమ భవిష్యత్తుపై ఆశలు రేపిన సమరసేనాని పోటు ప్రసాద్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఆయనకు కడపటి వీడ్కోలు పలికేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి కమ్యూనిస్టు శ్రేణులు, వామపక్ష అభిమానులు , వివిధ రాజకీయ పక్షాల నేతలు కదిలొచ్చారు. అమర్ హై పోటు ప్రసాద్ నినాదాలతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రతి హృదయం బరువెక్కింది. పోటు ప్రసాద్‌తో తమకున్న అనుబంధాన్ని లోలోపలే గుర్తు చేసుకుంటూ కళ్లు చెమరుస్తుంటే అరుణ పతాకం చేబూని అడుగులేశారు. బుధవారం మరణించిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అంతిమ యాత్ర శుక్రవారం ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్ నుంచి ప్రారంభమైంది. ప్రజల సందర్శనార్థం పార్థివ దేహన్ని పార్టీ కార్యాలయానికి తరలించిన నేతలు సంతాప సభ అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. పోటు ప్రసాద్ 64 సంవత్సరాల వయస్సుకు సంకేతంగా 64 అరుణపతాకాలను చేబూనిన యువ దళం ముందు నడవగా ఆ తర్వాత డప్పు దళం, పార్టీ నాయకత్వం, కుటుంబ సభ్యులు ర్యాలీగా కదిలారు. బైపాస్ రోడ్డు, ఆర్టివో కార్యాలయం, గట్టయ్య సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు, ఐటి హబ్ సెంటర్, మమత రోడ్డు మీదుగా ర్యాలీ మమత మెడికల్ కళాశాలకు చేరుకుంది. దారి పొడవునా జనం ప్రసాద్‌కు నివాళులర్పించారు. సమకాలిన రాజకీయాలలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటి ఖమ్మంజిల్లా రాజకీయాలలోనూ ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ యవనిక పైన తనదైన ముద్రవేసిన పోటు ప్రసాద్‌కు ఘనమైన వీడ్కోలు లభించింది. ఇటీవల కాలంలో ఏ రాజకీయ నేత మరణానికి జనం ఇంతగా స్పందించలేదంటే అతిశయోక్తి కాదు. విద్యార్థి ఉద్యమం నుంచి ఎర్రజెండాతో పెనవేసుకున్న ఆయన బంధం, త్యాగాలకు చిరునామాగా మారిన ఆయన కుటుంబం వెరసి ప్రసాద్‌ను ఉద్యమ పదంలో ఒక వేగుచుక్కలా నిలిపింది. బరువెక్కిన హృదయాలు అమర్ హై నినాదాలతో ముందుకు సాగాయి. ప్రసాద్ కోరిక మేరకు కుటుంబ సభ్యులు ఆయన పార్థివ దేహన్ని మమత మెడికల్ కళాశాలకు అప్పగించారు. మమత వైద్య విద్యా సంస్థల కార్యదర్శి పువ్వాడ జయశ్రీ కుటుంబ సభ్యుల నుంచి అశ్రునయనాల మధ్య స్వాధీనపర్చుకున్నారు. మమత సంస్థలకు అంకురార్పణ చేసిన వారిలో పోటు ప్రసాద్ ఒకరని పోటు ప్రసాద్, పువ్వాడ ఉదయ్‌కుమార్‌ల బంధాన్ని జయశ్రీ గుర్తు చేసుకున్నారు. ఉదయ్, ప్రసాద్ అనుబంధాలకు గుర్తుగా ఉదయ్ చిత్రపటం సాక్షిగా ప్రసాద్ పార్థివ దేహన్ని వైద్య విద్యార్థుల పరీక్షల కొరకు అప్పగించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, పోటు ప్రసాద్‌కు అత్యంత ఆప్తులుగా ఉన్న దండి సురేష్, మహ్మద్ మౌలానా, బి. అయోధ్య, జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, గోవిందరావు, పలువురు యువ నేతలు ఆయన పార్థివ దేహాన్ని మోశారు. ఈ అంతిమ యాత్రలో కుటుంబ సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ర్యాలీ అగ్రభాగాన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాలమల్లేష్, ప్రజా సంఘాల బాధ్యులు, వివిధ జిల్లాల సిపిఐ కార్యదర్శులు, కుమారుడు సాత్విక్, తల్లి సక్కుబాయి, సతీమణి నిర్మల, సోదరి, సోదరులు పాల్గొన్నారు.

## ఆచరణ సిద్ధాంతాల కలబోత పోటు ప్రసాద్






కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాన్ని ఆచరణలో రుజువు చేసిన నేత పోటు ప్రసాద్. సాంప్రదాయ కమ్యూనిస్టు పార్టీ కుటుంబంలో జన్మించిన ప్రసాద్ కుటుంబ వారసత్వంతో పాటు పార్టీ వారసత్వాన్ని కూడా పుచ్చుకుని కడవరకు ఎర్ర జెండా నీడన ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహించారు. నేను ఆచరణ వ్యవహారంలో విబేధించి సిపిఎం నుంచి సిపిఐలో చేరిన తర్వాత నా జీవిత కాలంలో అత్యంత సన్నిహితంగా మెలిగిన వ్యక్తులలో పోటు ప్రసాద్ ఒకరు. కార్మిక నాయకునిగా నేను చేరినప్పుడు పార్టీలో ఉన్న ప్రసాద్ తాను ఓ ప్రజా సంఘానికి నాయకుడైనా అన్ని ప్రజా సంఘాలను కలుపుకు పోయేవాడు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శిగా నేను పనిచేస్తున్నప్పుడు నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించడంతో పాటు కార్యక్రమాల జయప్రదానికి ఆయన ఇచ్చిన దన్ను నేను ఎప్పటికి మరువలేను. జిల్లా కార్యదర్శిగా గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో ప్రసాద్‌లో నేను ఒక కొత్త కమ్యూనిస్టును, సరికొత్త వ్యక్తిని చూశాననడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. గతంలో ఉన్న అంకిత భావానికి తోడు పట్టుదలతో విస్తృత కార్యక్రమాల నిర్వహణకు రూపకల్పన చేశారు. ఇక్కడొక విషయాన్ని ప్రస్తావించాలి. నాయకత్వమంటే పని చెప్పడమనే భావన ఉండేది కానీ ప్రసాద్ తాను చేస్తూ అందరి చేత చేయిస్తుండేవాడు. జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ సీనియర్లు అందరిని కలుపుకుని పార్టీ సభ్యత్వ పునరుద్ధరణ 2025కు సంబంధించి ఆయన తీసుకున్న కార్యక్రమం ఎందరినో కార్యోన్ముఖులను చేసింది. గ్రామ గ్రామాన తిరుగుతూ పార్టీలో ఉన్న సీనియర్ల యోగక్షేమాలను అడుగుతూ యువ క్యాడర్‌ను కార్యోన్ముఖులను చేస్తూ ఆయన నిర్వర్తించిన పాత్ర ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పటికీ మరువదు. మేము పార్టీ కార్యాలయంకు వచ్చినప్పుడు శత వసంత సంబురాలకు సంబంధించి ఆయన ఆలోచనలు, కార్యాచరణ చెబుతున్నప్పుడు ఎంతో ఆనందం కలిగేది. మరింతగా పనిచేయాలన్న భావన ఉండేది. చలాకీగా ఉంటూ ఆ చలాకీ తనంలోనూ తన అధ్యయనాన్ని, కనుగొన్న విషయాలను మాకు క్షుణ్ణంగా విషదీకరిస్తూ గడిపిన ప్రసాద్ దూరం కావడం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు. ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమంపై తనదైన ముద్ర వేసిన ప్రసాద్ ధన్యుడు. పార్టీ సిద్ధాంతాన్ని అవగతం చేసుకోవడమే కాకుండా ఆచరణలో చూపిన ఆయన చిరస్మరణీయుడు.

–తాటి వెంకటేశ్వరరావు
వ్యవసాయ కార్మిక సంఘం
ఖమ్మంజిల్లా కార్యదర్శి

# మార్గదర్శి.. ఆత్మీయుడు.. చిరస్మరణీయుడు

(మొదటిపేజీ తరువాయి)

ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శిగా 36వ రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో జరిగినప్పుడు నాకు అత్యంత కీలక బాధ్యతను అప్పగించి ప్రోత్సహించారు. నన్ను విద్యార్థి సంఘం నేతగా తీర్చిదిద్దడంలో ప్రసాద్ చూపిన చొరవ, మార్గం ఎప్పటికీ మరువలేను. ప్రసాద్ ఏఐఎస్‌ఎఫ్ నేతగా ఉన్నప్పుడు ఖమ్మంలో ఎమ్యూజ్‌మెంట్ పార్కు ఓ పెద్ద సమస్యగా ఉండేది. జూదం నడుపుతూ యువతను పెడదారి పట్టిస్తుండేది యాజమాన్యం. ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్‌తో పాటు పిడిఎస్‌యు, పివైఎల్ సంయుక్తంగా ఎమ్యూజ్‌మెంట్ పార్కుపై దాడి చేసి దానిని ఖమ్మంలో లేకుండా చేయడంలో కీలక భూమిక పోషించిన వారిలో ప్రసాద్ ఒకరు. నేను, పోటు ప్రసాద్, సామినేని సురేష్ నిరంతరం కలిసి ఉండేవాళ్లం. నిర్ణయాలన్ని ఉమ్మడిగానే ఉండేవి. నా జీవితంలో ఓ ప్రధాన ఘట్టానికి సంబంధించి ప్రసాద్‌ను నిరంతరం గుర్తు చేసుకుంటాం. మేము ముగ్గురం సోదరులం కాగా నా కంటే పెద్దవాడైన మా అన్న హన్మంతరావు పెళ్లి విషయంలో మరి కొంత కాలం ఆగుదామని అనుకున్నప్పుడు పెద్ద వాడికి కాకుండా రెండవ వాడికి పెళ్లి ఎలా చేయాలన్న మీ మాంస నెలకొంది. నేను అన్నకు కాకుండా పెళ్లి చేసుకోను అన్నప్పుడు అప్పటి పరిస్థితులను బట్టి ఇరు కుటుంబాలో పాటు మా ఇద్దరిని ఒప్పించి పార్టీ పెళ్లి ప్రసాద్ చేయించారు. అలా నా ఎదుగుదలలో ప్రతి మెట్టులోనూ ప్రసాద్ ప్రోత్సహం నేను ఎన్నటికి మరిచిపోను. 2009లో జిల్లా కార్యదర్శిగా ఉన్న కూనంనేని సాంబశివరావు శాసన సభ్యునిగా ఎన్నిక కావడంతో జిల్లా కార్యదర్శి ఎంపిక అనివార్యమైంది. అప్పుడు ప్రసాద్, నా పేరు చర్చకు వచ్చాయి. అప్పటి పార్టీ ముఖ్యులు ఇద్దరిని విడివిడిగా పిలిచి చర్చించాలని భావించారు. కానీ నేను ప్రసాద్ అలా అవసరం లేదని ఇద్దరం కలిసి పార్టీ ముఖ్యుల వద్దకు వెళ్లి మా ఇద్దరిలో ఎవరిని నియమించిన ఫర్వాలేదు. కలిసి పనిచేస్తాం. నిర్ణయం మీదే అని చెప్పి వచ్చామని అది మా ఇద్దరి మధ్య ఉన్న అనుబంధానికి, అవగాహనకు ఒక తార్కణమన్నారు. నేను జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు నా కంటే సీనియరైన ప్రసాద్ నాకు అన్ని విధాలా సహకరించే వాడని పార్టీని నడపడంలోనూ, ముందు ఆలోచన చేయడంలోనూ ప్రసాద్ దిట్ట అని లోతైన అధ్యయనం, సమస్య పట్ల అవగాహన ప్రసాద్‌కు ఉండేదన్నారు. ఒక బలమైన కమ్యూనిస్టు పార్టీ నుంచి వచ్చిన ప్రసాద్ అదే భావాజాలాన్ని తుది శ్వాస వరకు కొనసాగించారన్నారు. పోటు వెంకటయ్య, ఎర్రమ్మలతో ఆ కుటుంబంలో కమ్యూనిస్టు బీజం పడిందని ఆనాటి నుంచి నాలుగు తరాలుగా కమ్యూనిస్టు ఉద్యమానికి పోటు ప్రసాద్ కుటుంబం అంకితమైపోయిందన్నారు. పోటు ఎర్రమ్మను సాయుధ తెలంగాణ పోరాట కాలంలో అప్పటి రజాకారు మూకలు తీవ్ర ఇబ్బందులు పెట్టేవని. శిరోముండనం చేసి ఊరేగించినా భయపడలేదని పార్టీ పట్ల మరింత అంకిత భావాన్ని చాటిందన్నారు. నూరు ఎకరాల ఆసామి అయిన పార్టీ కోసం అంకితమై గుంటూరు మిర్చి యార్డులో నిండు చూలాలైన కుమార్తెతో కూలీల మధ్య గడిపిన సాహసవంతురాలు ప్రసాద్ నాయనమ్మ ఎర్రమ్మ. పోటు ప్రసాద్ తండ్రి రాఘవయ్య గారు పార్టీ చీలిక సమయంలో సిపిఐ వైపు నిలవడంతో పెద్ద ఎత్తున రాజకీయ ఘర్షణలు ఉండేవని ఇంటిని కూల్చేందుకు ప్రయత్నాలు జరిగాయని మొత్తం పోటు రాఘవయ్య కుటుంబాన్ని హతమార్చేందుకు సైతం ప్రయత్నాలు జరిగాయన్నారు. గడ్డపారలతో ఇంటిని పొడిచి బాంబుల వర్షం కురిపించిన జంకని కుటుంబం వారిది. పోటు రమేష్‌పై హత్యయత్నం జరిగినా భయపడకుండా ఎర్ర జెండాను భుజనా మోసిన ఓ త్యాగమయ కుటుంబం పోటు ప్రసాద్‌ది. పోటు ప్రసాద్ సోదరీమణులు, సోదరులు పార్టీకే అంకితమై పనిచేస్తున్నారని పోటు ప్రసాద్ నిబద్ధత, నిజాయితీ, సమకాలీన రాజకీయాలలో అగ్రభాగాన నిలిపిందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని వీడలేదని అదే సమయంలో పార్టీని విడిచిన వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించే వారని అంతకు ముందు ఎంత ఆత్మీయుడైనా, బంధువైనా పార్టీ మారితే మాత్రం పూర్తిగా దూరం పెట్టేవాడు. పోటు ప్రసాద్ సహచరి నిర్మల అక్క, కుమారుడు చింటు మేమందరం ఒక కుటుంబ సభ్యుల్లాగా ఉండేవారం. మాది దాపరికాలు లేని జీవితం. భౌతికంగా ఇద్దరం వేరైనా ఒకే మాట, ఒకే బాటగా పనిచేశాం. ఆయన మరణానికి కొద్ది నిమిషాల ముందు తనతో ఫోన్‌లో మాట్లాడారు. అవే చివరి మాటలు అవుతాయని నేను ఊహించ లేదు. ప్రసాద్ నేతృత్వంలో ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు ఉద్యమం సరి కొత్త ఊపును, రూపును సంతరించుకుంటున్న వేళ దురదృష్టకర పరిణామం వెంటాడింది. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా తీరని లోటు. ప్రజా ఉద్యమాలకు ప్రత్యేకించి ఖమ్మంజిల్లా ఉద్యమానికి ప్రసాద్ లేని లోటు పూడ్చ లేనిది. ప్రసాద్ ఆశయ సాధనకు పునరంకితమవుతూ మార్గదర్శి, ఆత్మీయుడు, చిరస్మరణీయుడైన ప్రసాద్‌కు నివాళులర్పిస్తూ ....

–బాగం హేమంతరావు
సిపిఐ జాతీయ సమితి సభ్యులు

## విద్యార్థి ఉద్యమ నేతగా పోటు ప్రసాద్



ఖమ్మంజిల్లా విద్యార్థి ఉద్యమంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన నేతలలో పోటు ప్రసాద్ ఒకరు. విద్యార్థి ఉద్యమాలలో అగ్రభాగాన నిలిచిన పోటు ప్రసాద్ ఇంటర్మీడియట్ విద్యను కోదాడలో పూర్తి చేశారు. ఖమ్మంలోని సిద్దారెడ్డి కళాశాలలో చేరారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) నాయకునిగా, జిల్లా కార్యదర్శిగా పని చేసిన పోటు ప్రసాద్ ఖమ్మంలో పిజి కళాశాల సాధన ఉద్యమంలో అగ్రభాగాన నిలిచారు. పోలీస్ నిర్బంధాలను సైతం లెక్కచేయక కళాశాల ఉద్యమంలో ముందు భాగాన నిలిచారు. విద్యార్థి ఉద్యమమే ఈ సమాజ మార్పుకు దోహదపడుతుందని నమ్మిన వారిలో పోటు ప్రసాద్ ఒకరు. లోతైన అధ్యయనం, సమస్యల పట్ల అవగాహన కలిగిన ప్రసాద్ కార్మిక నాయకునిగా పనిచేస్తున్నప్పుడు ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీ జిలా కార్యదర్శిగా విద్యార్థి ఉద్యమానికి ఎనలేని ప్రోత్సహం అందించారు. సంక్లిష్ట స్థితిలో ఉన్న ప్రతిసారి దన్నుగా నిలిచి ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో మాకు మార్గదర్శిగా నిలిచారు. ఆయన హఠాన్మరణం భవిష్యత్తు విద్యార్థి ఉద్యమానికి తీరని లోటు. విద్యను కాషాయికరణ వైపు పాలకులు పరుగులు పెట్టిస్తున్న నేపథ్యంలో పోటు ప్రసాద్ లాంటి వ్యక్తులు లేకపోవడం అత్యంత బాధాకరం. పోటు ప్రసాద్ విద్యార్థులను కార్యోన్ముఖులను చేయడంలోనూ, ఉద్యమాలు నడపడంలోనూ దిట్ట. సమాజం పట్ల అవగాహన కలిగినప్పుడే విద్యార్థి నేతలుగా ఎదుగుతారని చెప్పే ఆయన మాటలు సదా అనుసరణీయం. భవిష్యత్తు విద్యార్థి ఉద్యమాలకు అమరజీవి పోటు ప్రసాద్ ప్రేరణగా నిలుస్తారని ఆశిస్తూ ...

–ఇటికాల రామకృష్ణ
ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సభ్యులు







## కార్మికవర్గ చైతన్య స్ఫూర్తి

కార్మిక వర్గాన్ని చైతన్యపర్చడంలోనూ, కార్మికోద్యమాలకు సన్నద్ధం చేయడంలోనూ పోటు ప్రసాద్ ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. గతంలో అసంఘటిత రంగానికే పరిమితమైన ఏఐటియుసిని ఖమ్మంజిల్లాలో సంఘటిత రంగాన్ని ఆకర్షించి బ్యాంక్ ఎంప్లాయిస్, బిఎస్ఎన్ఎల్ సహా పలు ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన నాయకులను సిపిఐ కార్యాలయం మెట్లు ఎక్కించారు. విద్యార్థి సంఘంలో పనిచేస్తున్నప్పుడు నాకు పరిచయమైన పోటు ప్రసాద్ మాకు అత్యంత ఆప్తుడుగా మారారు. సమయం దొరికినప్పుడల్లా పోరాట ఘట్టాలను వివరించి కార్యకర్తలను కార్యోన్ముఖులను చేసేవారు. ప్రజా సంఘాల నిర్మాణంలో పోటు ప్రసాద్‌ది అందే వేసిన చేయి. నిర్మాణ లోపాలను గ్రహించి వాటిని సరిదిద్దుతూ ముందుకు నడిపేవారు. ఏఐటియుసికి పార్టీ జిల్లా కార్యదర్శిగా ఎంతో దన్నుగా నిలిచారు. ఏఐటియుసి చరిత్రను తెలియజేస్తూ కార్మిక సమస్యల పట్ల అవగాహన కలిగిస్తూ ఉద్యమ నిర్మాణం చేసేవాడు. అత్యున్నత స్థాయికి పార్టీని తీర్చిదిద్దుతున్న వేళ ఆయన మరణం యావత్ కార్మిక లోకానికి తీరని శాపంగా మారింది. సంస్మరణ వేళ నివాళులర్పిస్తూ ....

**–తోట రామాంజనేయులు**
**ఎఐటియుసి జిల్లా కార్యదర్శి**



# జిల్లా ఉద్యమంపై చెరగని సంతకం





పుట్టుక ఎంత సహజమో మరణం అంతే సహజమని జనన మరణాల మధ్యన ఉన్న జీవిత కాలమే గుర్తింపునిస్తుందని నమ్మె అతి కొద్ది మందిలో పోటు ప్రసాద్ ఒకరు. చేతనైతే సాయం చేయడం తప్ప అపకారం తలపెట్టని గొప్ప వ్యక్తిత్వం ఆయన సొంతం. దివంగత సిపిఐ నేత పోటు ప్రసాద్ జీవితంలో ఉన్న రెండు పార్శ్వాలు అభినందనీయం, అనుసరణీయం. సంపన్న రైతు కుటుంబంలో జన్మించిన ఆ డాబు దర్పాన్ని ఎప్పుడు ప్రదర్శించే వాడు కాదు. నిరాడంబర జీవితం గడుపుతూ పది మందికి సాయపడాలన్న తత్వం పోటు ప్రసాద్‌ది. రక్త సంబంధంతో వచ్చిన వారసత్వంతో పాటు రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని కడ వరకు సాగిన ఆయన వ్యక్తిగత జీవితంలో చిన్న మచ్చకు కూడా తావులేదు. విద్యార్థి దశ నుంచి పార్టీ జిల్లా కార్యదర్శి వరకు అదే భరోసా, అదే కలుపుగోలు తనం, అదే దన్నుగా నిలిచేతత్వం. ఓ దశలో ఆయన స్వగ్రామమైన వెలిదండ రంగాపురంలో రాజకీయ కక్షల కారణంగా ప్రత్యర్థులు వీళ్ల వ్యవసాయ భూములను దున్ననివ్వలేదు. ఆ కుటుంబం మొత్తాన్ని హతమార్చేందుకు పలు ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. ఈ విపత్కర సమయంలో ఓ ట్రాక్టర్ కొనుగోలు చేసి ఖమ్మంలో కిరాయికి నడుపుతూ కుటుంబ పోషణ గావించారు. అటువంటి సమయంలోనూ ఎందుకు ఈ బాధ పార్టీ కోసం ఎందుకింత ఇబ్బంది అని ఆ కుటుంబంలో ఒక్కరంటే ఒక్కరికి ఆలోచన రాలేదంటే అది ఎంత త్యాగమయ కుటుంబమో అవగతమవుతుంది. ప్రసాద్ సోదరుడు రమేష్‌ను ప్రత్యర్థులు అటకాయించి హతమార్చే సమయంలో రమేష్ తీవ్ర గాయాలపాలయ్యాడు. దాదాపు రెండు మాసాలు హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రిలోనే గడపాల్సి వచ్చింది. ఆ సమయంలో ప్రసాద్ వారి తమ్ముడు పూర్ణచందర్‌రావు (బుజ్జి) మనో ధైర్యంతో ఆ గ్రామంలో పార్టీకి అండగా నిలుస్తూ ప్రత్యర్థులను అడ్డుకున్నారు తప్ప వెన్ను చూపలేదు. వీరి సోదరి పోటు కళావతి గురించి ఖమ్మంజిల్లా రాజకీయాలతో ఏ మాత్రం పరిచయం ఉన్న వారికైనా చెప్పాల్సిన పని లేదు. ఎంతో ధీరోదాత్తం, ముందు చూపు ఆ కుటుంబ సొంతం. ఆ కుటుంబం నుంచి వచ్చిన ప్రసాద్ జిల్లా కార్యదర్శిగా నాలుగేళ్లు మాత్రమే పనిచేసినా జిల్లా ఉద్యమంపై చెరగని ముద్ర వేశారు. యావత్ జిల్లా కలియ తిరుగుతూ ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ సహచరులతో కలిసి చేపట్టిన కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నాయనడంలో సందేహం లేదు. రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో భూ పోరాటాలకు సంబంధించి అప్పటి యావత్ జిల్లా నాయకత్వం అమరణ నిరాహార దీక్షల్లో ఉండగా పోటు ప్రసాద్ ఒక్కరే జిల్లా క్యాడర్‌ను సమీకరించి చేసిన ఆందోళన ఎప్పటికీ మరచిపోలేనిది. జిల్లా పరిషత్ సెంటర్‌లో పోలీసులు లాఠీలతో కొడుతున్నా సహచరులతో కలిసి పోలీసులపై తిరగబడ్డారు తప్ప పారిపోలేదు. పోలీసులు వ్యాన్‌లో పడేసి కొడుతున్న సమయంలోనూ ఆయన నినదించిన తీరు ఎందరికో ధైర్యాన్ని ఇచ్చింది. నిరంతరం పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మార్చుకుంటూ సహచరులు మారాలని కోరుకునే ప్రసాద్ జిల్లా కార్యదర్శిగా ఎంతో పరిణితి ప్రదర్శించారు. ఒక పక్క అధ్యయనం పెంచాలని స్టడీ సర్కిల్స్ నిర్వహణ, మరో పక్క యువజన విద్యార్థి ఉద్యమాల నుంచి భవిష్యత్ నాయకత్వాన్ని అందించాలనే లక్ష్యంతో యువజన విద్యార్థి సంఘాలపై ప్రత్యేక దృష్టి సారించే వారు. పార్టీ నిర్మాణం పద్ధతులపై దృష్టి కేంద్రీకరించి పార్టీలో ఉన్న ప్రతి ఒక్కరూ తనకు అప్పగించిన పనిని చేయాలనే వారు. ప్రతి నిత్యం పార్టీ కార్యాలయంకు వస్తూ ప్రజా సంఘాల బాధ్యుల పని గురించి తెలుసుకునే వారు. ఎవరికి ఏ బాధ్యతనిచ్చాం, ఎంత వరకు నెరవేర్చారు అనే దానిని నిరంతరం పరిశీలించే వారు. పార్టీ సభ్యత్వ చేర్పింపులో జిల్లాను రాష్ట్ర స్థాయిలోనే అగ్రగామిగా నిలిపిన ప్రసాద్ పార్టీ శత వసంత దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తలపోసిన పోటు ప్రసాద్ తిరిగి రాని లోకాలకు సాగిపోయారు. ఆయన మరణం తీరని లోటు ఆయన మిగిల్చిన జ్ఞాపకాలు పది కాలాల పాటు పార్టీ పనిచేయడానికి సరిపడ సత్తువ నిచ్చారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ వేళ ప్రసాద్ దీక్షా దక్షితలను, కార్యాచరణను నిత్యం స్మరించుకుంటూ ముందుకు సాగడడమే మనమిచ్చే నిజమైన ఘన నివాళి.




























# త్యాగాల గని.. పోరాటాల ముద్దుబిడ్డ పోటు అజరామరుడు

-ఎర్ర జెండాకు వన్నెతెచ్చిన చైతన్య స్ఫూర్తి
-ఆశయం, ఆచరణ, మూర్తిభవించిన ఘనుడు
-పోటు ప్రసాద్ సంతాప సభలో వక్తలు

**ప్రజాపక్షం/ఖమ్మం :** త్యాగాలకు చిరునామాగా, పోరాటాలకు బాసటగా ఉద్యమ పదాన చిరస్థాయిగా నిలిచిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అజరామరుడని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఎర్ర జెండా ఉన్నంత కాలం పోరాడే వారి ప్రతి గుండెల్లోనూ పోటు ప్రసాద్ చిరస్థాయిగా నిలిచి ఉంటారని ఆయన తెలిపారు. బుధవారం మరణించిన పోటు ప్రసాద్ సంతాప సభ శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జరిగింది. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ అసలైన కమ్యూనిస్టుకు పర్యాయ పదంగా పోటు ప్రసాద్ నిలిచారని కమ్యూనిస్టు ఎలా ఉండాలో, ఎలా పనిచేయాలో ప్రసాద్ అలా పనిచేశారని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం నిస్సేజంలో ఉన్నప్పుడు ఒక స్ఫూర్తిని రగిల్చిన అమరుడు ప్రసాద్ అన్నారు. చాలా మంది కమ్యూనిస్టుగా జీవించాలని ఆశపడేలా, తాపత్రయపడేలా ప్రసాద్ జీవితం సాగిందని కూనంనేని తెలిపారు. ఇబ్బందులకు ఎదురెళ్లడమే ఆ కుటుంబానికి తెలుసని ఒక సంపన్న కుటుంబంలో జన్మించి పేదల కోసం అష్ట కష్టాలు పడిన ఒక త్యాగమయ కుటుంబం పోటు ప్రసాద్ దన్నారు. నాయనమ్మ ఎర్రమ్మ, తండ్రి రాఘవయ్య వారసత్వాన్ని పునికిపుచ్చుకుని పోరాట వారసుడిగా పోటు ప్రసాద్ విద్యార్థి, ట్రేడ్ యూనియన్ రంగాలలో పనిచేసి ఎన్నో సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఏ పని అప్పగించినా పట్టుదలతో, కసితో పనిచేసి విజయాన్ని సాధించేవాడని సమకాలిన రాజకీయాలలో సైద్ధాంతిక అవగాహన కలిగి సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన అతి కొద్ది మందిలో పోటు ప్రసాద్ ఒకరన్నారు. నాటి విద్యార్థి ఉద్యమం నుంచి విద్యుత్ ఉద్యమం, ఇందిరా పార్కు స్వాధీన ఉద్యమం వరకు పోరాటంలో ముందు నిలిచేవారని లాఠీ దెబ్బలైనా తిన్నాడు కాని వెనుతిరగలేదని కూనంనేని తెలిపారు. 2007లో భూ పోరాటాల సందర్భంగా ఖమ్మంజిల్లాలో ప్రసాద్ నిర్వహించిన పాత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రసాద్ మరణం తనను తీవ్రంగా కలిచివేసిందని కాని ప్రసాద్



వేసిన పాదులు పెరిగి వికాసిస్తుండడంతో కమ్యూనిస్టు ఉద్యమం పట్ల ప్రజలకు విశ్వాసం కలిగేలా చేసినందుకు సంతోషం కలుగుతుందన్నారు. ప్రసాద్ ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని కూనంనేని పిలుపునిచ్చారు.

**మమత సంస్థలకు అంకురార్పణ చేసిన పోటు : పువ్వాడ అజయ్**

దినదిన ప్రవర్ధమానమై దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద సంస్థలుగా కీర్తి గడించిన మమత సంస్థల ఏర్పాటుకు అంకురార్పణ చేసినవాడు పోటు ప్రసాద్ అని రాష్ట్ర మాజీ మంత్రి పోటు ప్రసాద్ స్నేహితుడు పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. తన సోదరుడు ఉదయ్‌కుమార్, పోటు ప్రసాద్‌లు కలిసి ప్రతిభ ప్రజ్ఞ కళాశాలలను స్థాపించారని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రసాద్ సంస్మరణ సభలో మాట్లాడుతూ మా సోదరుడు ఉదయ్‌కుమార్ మాకెంతో పోటు ప్రసాద్ కూడా అంతేనని తెలిపారు. 42 సంవత్సరాలుగా ఒక జట్టుగా పనిచేశామని మా నాన్న పువ్వాడ నాగేశ్వరరావు ప్రసాద్ మరణం తట్టుకోలేక తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారని అది ప్రసాద్‌తో మా కుటుంబానికి ఉన్న అనుబంధమన్నారు. విద్యార్థి దశ నుంచి ఉద్యమంపై అవగాహన కలిగిన పోటు ప్రసాద్ కమ్యూనిస్టు పార్టీ సారధ్య బాధ్యతలు తీసుకున్నప్పుడు తామెంతో గర్వపడ్డామని సంతోషంతో ఇక కమ్యూనిస్టు ఉద్యమ బలోపేతం తథ్యమనుకుంటున్న సమయంలో









ఆయన మరణం అత్యంత బాధాకరమన్నారు. ప్రసాద్‌ను మననం చేసుకుంటూ అజయ్‌కుమార్ వేదికపైనే బోరున విలపించారు. పోటు ప్రసాద్ కుటుంబానికి అండగా ఉంటామని, ఉద్యమానికి తమ నిరంతర సహకారం కొనసాగుతుందని అజయ్‌కుమార్ తెలిపారు.




# నేను ఎరిగిన పోటు ప్రసాద్

కా॥ పోటు ప్రసాద్ నాకు 42 సంవత్సరాలుగా తెలుసు. ఆయన విద్యార్థి సంఘం నాయకునిగా ఉన్నప్పుడు నేను విద్యార్థి రంగంలో ఉన్నాను. ఖమ్మంజిల్లా పార్టీలో 2000 సంవత్సరంలో నేను రైతు సంఘం జిల్లా కార్యదర్శిగా, కా॥ పోటు ప్రసాద్ ఏఐటియుసి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా జిల్లా కేంద్రం నుండి పని చేయడం ఒకే రోజు జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎంపిక కావడం యాధృచ్ఛికమే అయినా ఒకే చోట కలిసి పనిచేసే అవకాశం దొరికింది. అఖిల భారత రైతు సంఘం జాతీయ మహాసభలు ఖమ్మంలో 2001 మార్చిలో జరిగాయి. ఆహ్వాన సంఘంలో హేమాహేమీలైన నాయకులతో పాటు నేను, ప్రసాద్, హేమంతరావు కలిసి పనిచేశాం. అసంఘటిత రంగానికే పరిమితమైన ఏఐటియుసిని బ్యాంక్, టెలికం, సింగరేణి మొదలైన రంగాలకు సంబంధించిన కార్మికులను పార్టీ కార్యాలయం వైపు రప్పించిన ఘనత పోటు ప్రసాద్‌కు దక్కుతుంది. పోరాటంలో ధైర్యంగా లాఠీలకు ఎదురొడ్డి నిలిచే ధీశాలి కా॥ ప్రసాద్. పేద ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఖమ్మం బస్టాండ్ సెంటర్‌లో ఆనాటి జిల్లా కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో చాలా మంది నాయకులం ఆమరణ నిరాహార దీక్ష చేస్తుంటే వారం రోజులైనా ప్రభుత్వం నుండి స్పందన రానందున జిల్లా పార్టీ ఆధ్వర్యంలో వేలాది మంది పార్టీ కార్యకర్తలను సమీకరించి ఖమ్మం నగరాన్ని స్తంభింపజేసి ప్రభుత్వ కార్యాలయాలను మూసివేయించారు. ప్రసాద్‌ను పోలీసులు కొట్టి అరెస్టు చేసినా వెరవలేదు. పార్టీ నిర్వహించే ఆందోళనలు, ధర్నాలను మిలిటెంట్‌గా మార్చగలిగిన సమర్థుడు ప్రసాద్. పార్టీ అంతరంగిక విషయాలు, చర్చలు తన ఆలోచనలకు భిన్నంగా ఉన్న మనసులో ఉంచుకోవడం కక్షతో సాధించుకోవాలనుకోవడం ప్రసాద్‌కు ఏనాడు లేదు. జిల్లా పార్టీ కార్యదర్శిగా పార్టీ నిర్మాణ సైద్ధాంతిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆలోచించేవాడు. ప్రతి ఏడాది రాజకీయ సైద్ధాంతిక శిక్షణా తరగతులు నిర్వహించే వారు. ప్రతి నెల నాయకులకు, కార్యకర్తలకు స్టడీ సర్కిల్స్, సెమినార్లు, స్లయిడ్స్ ద్వారా ప్రదర్శనలు ఇప్పించే వారు. క్రమం తప్పకుండా పార్టీ కార్యాలయానికి సకాలంలో వచ్చేవారు. పార్టీలో జీవిత కాలం పనిచేసిన కార్యకర్తలు మరణించినప్పుడు వారికి ఘనంగా వీడ్కోలు పలికడంలో ప్రసాద్‌ది ఓ ప్రత్యేక శైలి. తుది వరకు ఎర్ర జెండా నీడలో పనిచేసిన ఒరిగిన వారిని ఘనంగా సాగనంపాలని నిరంతరం క్యాడర్‌కు చెబుతూ ఉండేవారు. వృద్ధాప్యంలో లేదా అనారోగ్యంతో బాధపడే వారి పట్ల ప్రసాద్ ఆలోచించే విధానం మనందరికి ఎప్పటికైనా అనుసరణీయమే. ప్రతి ఏడాది పార్టీ ఆవిర్భావ దినోత్సవం డిసెంబర్ 26న రెడ్ షర్ట్ వాలంటీర్లతో ఖమ్మం నగరమంతా కవాతు తొక్కిస్తూ ఘనంగా నిర్వహించే వారు. సిపిఐ పార్టీ 100 సంవత్సరంలోకి అడుగిడుతున్న తరుణంలో పార్టీ సభ్యత్వం పూర్తి చేసుకుని పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించుకోవాలని పగలు, రాత్రి అనే తేడా లేకుండా ఈ 15 రోజుల్లో విశ్రాంతి లేకుండా 70 గ్రామాలు తిరిగారు. ప్రసాద్ ఆకస్మిక మరణం పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేపోతున్నారు. సిద్ధాంతం పట్ల రాజీలేని తనం, చెప్పింది చేసే ఆచరణతత్వం, ఆర్భాటాలకు పోకుండా నిరాడంబరంగా జీవించడం ప్రతి ఒక్కరూ ప్రసాద్ జీవితం నుంచి నేర్చుకోవాల్సి ఉంది. అటువంటి కామ్రేడ్‌ను కోల్పోవడం కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లాకే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రానికి, ప్రజా ఉద్యమాలకు తీరని నష్టం. ఆత్మీయుడైన మిత్రున్ని కోల్పోవడం అత్యంత బాధాకరం. ఖమ్మం కేంద్రంగా కమ్యూనిస్టు పార్టీ అఖిల భారత మహాసభలను నిర్వహించాలని పరితపించిన ప్రసాద్‌కు నివాళులర్పిస్తూ ...



బాధాతప్త హృదయాలతో....

–జమ్ముల జితేందర్‌రెడ్డి
సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు

## ప్రజాతంత్ర ఉద్యమాల వారధి, కమ్యూనిస్టు ఉద్యమ రథసారథి పోటు ప్రసాద్



అమరజీవి **పోటు ప్రసాద్** గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

**అశ్రునివాళి**

పేదల పక్షపాతి, నిష్కలంక ప్రజానాయకుడు
భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి
అమరజీవి **పోటు ప్రసాద్** గారి
సంస్మరణ వేళ అశ్రునివాళి...

| | |
|---|---|
| సిపిఐ ఏదులాపురం గ్రామశాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. | సిపిఐ వరంగల్ క్రాస్‌రోడ్ శాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. |
| సిపిఐ సత్యనారాయణపురం గ్రామశాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా. | సిపిఐ చిన్న తండా గ్రామశాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా |
| సిపిఐ తాళ్లేసేతండా గ్రామశాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా | సిపిఐ సూర్యనగర్ గ్రామశాఖ<br>ఖమ్మం రూరల్ మం॥, ఖమ్మం జిల్లా |



అమరజీవి **పోటు ప్రసాద్** గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

**అశ్రునివాళి**

కార్మికవర్గ పక్షపాతి
నిరంతరం మాకు అండగా నిలిచిన
అమరజీవి **పోటు ప్రసాద్** గారికి
అరుణాంజలి...

| | |
|---|---|
| జమ్ముల జితేందర్ రెడ్డి<br>సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు | కొండపర్తి గోవిందరావు<br>సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు |
| వేపూరి రవీంద్రబాబు<br>సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు | పావులూరి మల్లిఖార్జున్‌రావు<br>సిపిఐ మండల కార్యదర్శి |
| కూచిపూడి రవి<br>సిపిఐ జిల్లా సమితి సభ్యులు | రాసాల మోహన్‌రావు<br>సిపిఐ జిల్లా సమితి సభ్యులు |
| దూసరి గోపాలరావు<br>సిపిఐ మండల సహాయ కార్యదర్శి | తాళ్లూరి యాదగిరి<br>సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు |
| కన్నెబోయిన విజయమ్మ<br>మాజీ ఎంపిపి, చింతకాని. | నక్కబోయిన సుజాత కృష్ణ<br>మాజీ సర్పంచ్, కొదుమూరు. |
| పర్సా రామచంద్రరావు<br>మాజీ సర్పంచ్, చిన్నమండవ | పగిళ్లపల్లి ఏసు<br>వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు |
| ఆళ్ల రవీందర్<br>మాజీ సర్పంచ్, సీతంపేట. | మార్గం శ్రీనివాస్<br>మండల రైతు సంఘం అధ్యక్షులు |
| సిపిఐ రాఘవాపురం గ్రామ శాఖ | చిట్టూరి నరేష్<br>ప్రజాపక్షం రిపోర్టర్, చింతకాని. |

**సిపిఐ చింతకాని మండల సమితి**



అమరజీవి **పోటు ప్రసాద్** గారు
సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి

**అశ్రునివాళి**

మాకు అత్యంత ఆత్మీయుడు
అభ్యుదయ వాది
భారత కమ్యూనిస్టు పార్టీ
ఖమ్మం జిల్లా కార్యదర్శి
అమరజీవి **పోటు ప్రసాద్** గారికి
సంస్మరణ వేళ అశ్రునివాళి...

**బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ - ఖమ్మం**

**బత్తినేని ఐటి హబ్ - ఖమ్మం**

# త్యాగాలకు ప్రతీక పోటు కుటుంబం







కమ్యూనిస్టు ఉద్యమంలో త్యాగాలకు ప్రతీకగా పోటు ప్రసాద్ కుటుంబం నిలిచింది. దివంగత కమ్యూనిస్టు ఉద్యమనేత పుచ్చలపల్లి సుందరయ్య రచించిన ఆదర్శ కుటుంబాలు అనే పుస్తకంలోనూ, గంగినేని వెంకటేశ్వరరావు రచించిన చారిత్రాత్మక పుస్తకం ఎర్ర జెండాలలోనూ పోటు ప్రసాద్ కుటుంబానికి చోటు దక్కిందంటే ఆ కుటుంబ పోరాట పటిమ, త్యాగ నీరతి అవగతమవుతుంది. ఉద్యమాల పోరుగడ్డ నల్గొండ జిల్లాలోని వెలిదండ రంగాపురం గ్రామంలో ఎర్రమ్మ, వెంకటయ్య దంపతులు సాయుధ తెలంగాణ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ పక్షాన వీరోచిత పాత్ర పోషించారు. ఎర్రమ్మ పోరాట పటిమ ఎందరికో ఆదర్శం. ఆమె జీవితాన్ని కథలుగా చెప్పుకునే వారంటే ఆశ్చర్యం కలుగక మానదు. 100 ఎకరాలు పైబడిన ఆస్తికి యజమానురాలైనా ఎర్రమ్మ కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేస్తున్నారని గుండు గీసి (శిరోముండనం) ఊరేగింపు చేసినా ఆమె వెరవ లేదు కదా తన పోరాటాన్ని మరింత ఉధృతం చేసింది. ప్రత్యర్థులు కుటుంబంపై పగబట్టి కక్షసాధింపుకు పూనుకుంటే పోలీసులు మానవత్వాన్ని కోల్పోయి దాష్టీకాన్ని ప్రదర్శిస్తుంటే నిండు చూలాలైన కుమార్తెను వెంటబెట్టుకుని గుంటూరు జిల్లా మిర్చి యార్డు సమీపంలో ఎర్రమ్మ రహస్య జీవితాన్ని గడిపింది. పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వరరావు మొదలైన వారు ఎర్రమ్మ జాడ తెలుసుకుని ఆమె రహస్యంగా కలుసుకుని ఆమె సాహసానికి అభినందనలు తెలిపారు. అందుకే అప్పట్లో ఎర్రెర్రని ఉద్యమాల ఎర్రమ్మ అని సంబోధించే వారు. 103 సంవత్సరాల జీవితం గడిపిన ఎర్రమ్మ తమ పిల్లలకు అడుగులతో పాటు మాటలు నేర్పడమే కాదు ఉద్యమ ఉగ్గుపాలు పోసింది. మనవలు, మనవరాళ్లకు సైతం అదే దారి చూపింది. కుమారుడు రాఘవయ్య కమ్యూనిస్టు నేతగా ఉన్నాడని ఎన్నో ఇబ్బందులు పెట్టిన ఆమె ఏ నాడు ధైర్యాన్ని కోల్పోలేదు. పెద్ద సంఖ్యలో ప్రత్యర్థులు ఇంటిపై పడి గడ్డపారలతో పగలగొడుతూ కుటుంబం మొత్తాన్ని హత్య చేయాలని చూస్తున్నప్పుడు చాకచాక్యంగా కోడలిని, చిన్న పిల్లలను వెంట పెట్టుకుని బయటకు వచ్చి రక్షించుకుంది. కక్ష పోని ప్రత్యర్థులు కుక్కతో సహ పశువులను హతమార్చి వికృతానందం పొందారు. రాఘవయ్య తాలూకా కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అదే వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న రాఘవయ్య కుమారుడు పోటు రమేష్, పోటు ప్రసాద్, పోటు పూర్ణచందర్‌రావు కమ్యూనిస్టు పార్టీలో వివిధ హోదాల్లో పనిచేశారు. రాఘవయ్య కుమార్తెలు కళావతి, ఝాన్సీ, అనూష, అఖిల కమ్యూనిస్టు భావజాలంతోనే పనిచేస్తూ వస్తున్నారు. పోటు కళావతి మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలిగా, ఖమ్మం జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా సుదీర్ఘకాలం పాటు పనిచేసి ప్రస్తుతం జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఉన్నారు. ప్రసాద్ సతీమణి పోటు నిర్మల గురించి తప్పక ప్రస్తావించాలి. ప్రసాద్ విద్యార్థి దశ నుంచి ఉద్యమంలో పని చేస్తున్నా ఆయనకు సదా వెన్నంటి నిలిచింది. కుమారుడు రాజా సాత్విక్ సైతం తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ కమ్యూనిస్టు భావజాలంతో పని చేస్తున్నారు. ఈ ఆదర్శ కుటుంబం త్యాగాలనే సంపదగా మార్చుకున్నది. ధైర్యాన్ని ఆయుధంగా మార్చుకున్నది. అందుకే ఆ కుటుంబం అందరికీ ఆదర్శం కావాలి. ఆ కుటుంబ మృత వీరుల ఆశయ సాధనే లక్ష్యంగా పురోగమించాలి. అదే ఆ కుటుంబానికి మనమిచ్చే నివాళి.













